

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 16.04.2026 | సంపుటి: 3 | సంచిక: 75 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 16.04.2026 | VOLUME : 3 | ISSUE : 75 | PAGES: 8 | COST: 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575


# మూడు నెలలు.. 82 మరణాలు

- హైదరాబాద్‌లో పెరిగుతున్న రోడ్డు ప్రమాదాలు
- నగర వ్యాప్తంగా 54 బ్లాక్ స్పాట్ల గుర్తింపు
- ఎరైవ్ఎలైవ్‌లో భాగంగా 99 రోజుల కార్యాచరణతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు




2



దక్షిణాదికి ప్రాతినిధ్యం
# తగ్గితే ఉద్యమమే

3

- డీలిమిటేషన్ రాజకీయ సవరణగా మిగలొద్దు
- మహిళా రిజర్వేషన్లకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
- పునర్విభజనతో ముడిపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
- రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్' ముఖ్యమంత్రి

నేడు లోక్ సభ ముందుకు
# డీలిమిటేషన్ బిల్లు

- మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026 తీసుకొస్తున్న కేంద్రం



3

## పాలనలో దేశంలోనే తెలంగాణ ఆదర్శం

- ఇతర రాష్ట్రాల అధికారులు అధ్యయనం– రాష్ట్రవ్యాప్తంగా మరో 14 వేల సూపర్ స్పెషాలిటీ బెడ్స్

**సత్తుపల్లి, ఏప్రిల్ 15(రాజముద్ర న్యూస్) :**
ఇందిరమ్మ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని, తెలంగాణ మోడల్ పాలనను చూసి అనేక రాష్ట్రాల అధికారులు అధ్యయనం చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి

మిగతా 3వ పేజీలో..







- ఆర్డర్లు సిద్ధం చేసిన టీజీ ట్రాన్స్‌కో
- రాష్ట్రంలో ముదిరిన 'విద్యుత్' మంటలు
- పట్టువీడని కార్మికులు..
- ప్రభుత్వ అల్టిమేటంపై సీరియస్
- చర్చలు లేకుండా ఉద్యోగం పీకేస్తారా?
- సమ్మె వీడే ప్రసక్తే లేదని తెగేసి చెప్తున్న కార్మికులు
- ప్రభుత్వ తీరుపై తీన్మార్ మల్లన్న గర్జన

# 11 గంటలు డెడ్ లైన్..!!

**20 వేల మంది ఆర్టిజన్ల తొలగింపు సాధ్యమేనా?**

**(హైదరాబాద్ , ఏప్రిల్15 (రాజముద్ర న్యూస్ ):**
తెలంగాణ విద్యుత్ రంగంలో మునుపెన్నడూ చూడని రీతిలో పెను సంక్షోభం ముంచుకొస్తోంది. గత ఎనిమిది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులు తమ విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టడంతో విద్యుత్ సరఫరా వ్యవస్థ ప్రమాదంలో పడింది. ఒకవైపు కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం చావో రేవో అంటూ పోరాడుతుంటే, మరోవైపు ప్రభుత్వం 'ఉద్యోగానికి రాకుంటే తొలగిస్తాం..' అంటూ అల్టిమేటం జారీ చేయడంతో పరిస్థితి యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. తెలంగాణలో వెలుగులు నింపే విద్యుత్ శాఖలో ఇప్పుడు చీకట్లు కమ్ముకుంటున్నాయి. వేలాది మంది విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు తమ హక్కుల కోసం సమ్మెకు దిగడం, దానికి ప్రభుత్వం కఠిన నిర్ణయాలతో స్పందించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎనిమిది రోజులుగా

మిగతా 2వ పేజీలో..



## మోదీకి మద్దతుగా నారీ ర్యాలీ

- 'నారీ శక్తి వందన్'పై చర్చ జరగనున్న సందర్భంగా..

**హైదరాబాద్, ఏప్రిల్ 15(రాజముద్ర న్యూస్) :**
బీజేవైఎం ఆధ్వర్యంలో మహిళల సాధికారతకు మద్దతుగా, అలాగే మహిళలకు 33% రిజర్వేషన్ల బిల్లుకు అనుకూలంగా బీజేపీ¾ రాష్ట్ర మహిళా మోర్చా, యువ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం స్కూటీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు

మిగతా 3వ పేజీలో..

ప్రపంచాన్ని ఆకట్టుకునేలా
# పర్యాటకాభివృద్ధి

- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి
- కుతుబ్ షాహీ టూంబ్స్ లో పనుల పరిశీలన

2





## గ్రామీణాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు రూపొందించాలి

- టీజీ ఐఆర్డీ కు మంత్రి సీతక్క ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 15(రాజముద్ర న్యూస్):**
ఎంతోమంది నిపుణులున్న తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టీజీ ఐఆర్డీ ) గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేసేలా వినూత్నమైన కార్యక్రమాలను

మిగతా 2వ పేజీలో..



2

మహిళా బిల్లుకు ఓకే..
## డీలిమిటేషన్ కు నో

- వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే
- ఖర్గే నివాసంలో ఇండి కూటమి భేటీ

వడదెబ్బ బాధితులకు
# సత్వర చికిత్స



- ప్రతి హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఒక బృందం
- వేసవి నేపథ్యంలో హాస్పిటల్లలో ప్రత్యేక ఏర్పాట్లు

3



మహిళా రిజర్వేషన్లతో పాటు
## బీసీ బిల్లు పెట్టాలి

- కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మండిపాటు

2




2

పాఠశాల స్థలానికి
## రక్షణ కల్పించాలి

- సీఎస్ఆర్ నిధులతో భవనం నిర్మించాలి
- అన్యాక్రాంతమైన స్థలాన్ని స్వాధీనపరచుకోవాలి



# గ్రామీణాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు రూపొందించాలి

మొదటిపేజీ తరువాయి

రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. రాజేంద్రనగర్‌లోని సంస్థ కార్యక్రమాలు, కార్యకలాపాలపై ఆమె బుధవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల పురోగతిని సీఈవో నిఖిల మంత్రి సీతక్కకు వివరించారు. టీజీ ఐఆర్డీ ద్వారా ఇప్పటివరకు వివిధ విభాగాల పరిధిలో చేపట్టిన శిక్షణల ఫలితాలు, వాటి ప్రభావం గురించి కూడా వివరించారు. ముఖ్యంగా శిక్షణ పూర్తి చేసిన మాస్టర్ ట్రైనర్లు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు, ప్రస్తుతం వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. సంస్థలోని వివిధ విభాగాల పనితీరును సమగ్రంగా పరిశీలించి మంత్రి సీతక్క పలు కీలక సూచనలు చేశారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు స్థానిక సంస్థల విధులు, నిధులు, హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు సులభంగా అర్థమయ్యే శిక్షణ సామగ్రిని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తమ హక్కులు భాధ్యతలు తెలియజెబితే గ్రామాల అభివృద్ధి సంపూర్ణమవుతుందన్నారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న చట్టాలపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన పెంపొందించే దిశగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను టీజీ ఐఆర్డీ నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ అమలులో ఖచ్చితత్వం ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, సంస్థ ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రంగాల్లో అత్యున్నత శిక్షణ సంస్థగా పేరుగాంచిన టీజీ ఐఆర్డీ ప్రతిష్ఠను మరింత నిలబెట్టేలా సిబ్బంది శ్రమించాలని మంత్రి సీతక్క సూచించారు. సంస్థ ద్వారా అందించే శిక్షణలు గ్రామీణ పాలనలో నాణ్యతను పెంచేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సమీక్షలో శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, టీజీ ఐఆర్డీ ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రపంచాన్ని ఆకట్టుకునేలా పర్యాటకాభివృద్ధి

- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి
- కుతుబ్ షాహీ టూంబ్స్ లో పనుల పరిశీలన

హైదరాబాద్, ఏప్రిల్ 15:

రాష్ట్రంలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. కుతుబ్ షాహీ టూంబ్స్‌లోని ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌లో జరుగుతున్న పనులను ఆయన బుధవారం పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్‌లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను మినహాయించి మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి పరిశీలించారు.

**టూంబ్స్ నుంచి గోల్కొండ కోటకు రోప్ వే**

కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్‌ను సందర్శించారు. పురావస్తు శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని సమన్వయం చేసుకుని డీపీఆర్‌ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మాన్యుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడినుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చరిత్రాత్మక, విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియంను పర్యాటకంగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల (ఖాదీ) ప్రదర్శనను ఏర్పాటు చేయాలని పురావస్తు, టీజీటీడీసీ, కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలన్నారు. కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మూడు నెలలు.. 82 మరణాలు

హైదరాబాద్:

హైదరాబాద్ నగరంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 1,091 ప్రమాదాలు నమోదవగా, అందులో 82 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నివేదికలు వెల్లడించాయి. అతివేగం, అడ్డదారి ప్రయాణాలు, నిద్రమత్తులో డ్రైవింగ్ ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా పోలీసులు గుర్తించారు.

నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రమాదాలకు గురవుతున్న వారిలో ఎక్కువమంది 19 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల యువతేనని అధికారులు తెలిపారు. మొబైల్ ఫోన్లలో వీడియోలు చూస్తూ వాహనాలు నడపడం కూడా ప్రమాదాలకు దారితీస్తోంది. నగరవ్యాప్తంగా 54 ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా వీకెండ్లలో మద్యం సేవించి వాహనాలు నడపడం, రహదారులపై గుంతలు ఉండడం వంటి కారణాలు ప్రమాదాలను పెంచుతున్నాయి. ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలను తగ్గించేందుకు 'ఎరైవ్-ఎలైవ్' కార్యక్రమంలో భాగంగా 99 రోజుల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం, అతివేగం ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్యే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాల్లో ప్రమాదాల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు, ప్రజలు కలిసి జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# '11 గంటలు' డెడ్ లైన్..!!

మొదటిపేజీ తరువాయి

కొనసాగుతున్న ఈ నిరసన ఇప్పుడు నువ్వానేనా అన్న స్థాయికి చేరుకుంది.

**20వేల మంది కార్మికుల తొలగింపునకు రంగం సిద్ధం**

సమ్మెను అణచివేసే క్రమంలో ప్రభుత్వం అత్యంత కఠినమైన నిర్ణయానికి సిద్ధమైంది. నేడు ఉదయం 11 గంటల లోపు విధుల్లో చేరని పక్షంలో 20 వేల మంది ఆర్టిజన్లను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తామని టీజీ ట్రాన్స్ కో ఆదేశాలు జారీ చేసింది. అయితే, మమ్మల్ని తొలగించడం అంత సులభమా?' అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఒక్కో సెక్షన్‌లో సంవత్సరాల తరబడి అనుభవం ఉన్న తమను తొలగిస్తే, కొత్తగా వచ్చే వారికి గ్రిడ్ నిర్వహణ, సాంకేతిక సమస్యల పరిష్కారంపై అవగాహన ఉండదని, ఇది రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టడమేనని వారు హెచ్చరిస్తున్నారు.

**చర్చలు జరపకుండానే..**

తెలంగాణ విద్యుత్ సంస్థల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే ఆర్టిజన్లు సుదీర్ఘకాలంగా అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, సరైన భద్రతా ప్రమాణాల కల్పన వంటి డిమాండ్లతో వారు గత ఎనిమిది రోజులుగా రోడ్లపైకి వచ్చారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత పాలకులు 'ఆర్టిజన్లే విద్యుత్ శాఖకు వెన్నెముక.. వారిని ఉద్యోగులుగా గుర్తిస్తాం' అని ఇచ్చిన హామీలు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక బుట్టదాఖలు అయ్యాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి పిలుపు రాకపోవడంతో, సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం లేకుండా పోయింది.



**రాష్ట్రం అంధకారంలోకి వెళ్లనుందా?**

సమ్మె ప్రభావం అప్పుడే క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది. సబ్‌స్టేషన్ల నిర్వహణ కుంటుపడింది. గాలివానలు లేదా సాంకేతిక లోపాలు తలెత్తినప్పుడు లైన్లను బాగు చేసే వారు లేక వేలాది గ్రామాలు చీకటిలో మగ్గుతున్నాయి. విద్యుత్ గ్రిడ్ల సమతుల్యత దెబ్బతింటే అది గ్రిడ్ కుప్పకూలడానికి దారితీస్తుంది. అనుభవజ్ఞులైన సిబ్బంది సమ్మెలో ఉండటం వల్ల వ్యవస్థ ఛిన్నాభిన్నం అయ్యే ప్రమాదం ఉంది.

**ఏకపక్ష వైఖరిపై నిరసన**

ప్రజాస్వామ్య పద్ధతిలో కార్మికులను చర్చలకు పిలిచి సమస్యను సామరస్యంగా పరిష్కరించాల్సింది పోయి, బెదిరింపులకు దిగడంపై మేధావి వర్గం కూడా పెదవి విరుస్తోంది. 20 మందిని కాదు.. 20 వేల మందిని తొలగిస్తారా? అంటూ సోషల్ మీడియాలో ప్రభుత్వ తీరుపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకపక్షంగా ఆర్డర్లు పాస్ చేయడం వల్ల కార్మికుల్లో కసి పెరిగిందే తప్ప, భయం కలగలేదని సమ్మె శిబిరాల వద్ద కనిపిస్తున్న దృశ్యాలు చెబుతున్నాయి.కాగా, ప్రస్తుతం ప్రధాన ట్రేడ్ యూనియన్లు పరోక్షంగా మద్దతు ఇస్తున్నప్పటికీ, అవి కూడా ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే విద్యుత్ శాఖ పూర్తిగా స్తంభించిపోవడం ఖాయం.

**ఎటు చూసినా ఉత్కంఠ..**

ప్రభుత్వ నిర్ణయంపై కార్మికులు మాత్రం 'దేనికైనా సిద్ధం.. సమ్మె కొనసాగిస్తాం' అని తెగేసి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం దిగివచ్చి చర్చలు జరపకపోతే, తెలంగాణలో విద్యుత్ యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉంది. సామాన్య ప్రజలు మాత్రం ఈ ఈగోల పోరులో తమ ఇళ్లలో వెలుగులు ఎక్కడ ఆరిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు.



**తీన్మార్ మల్లన్న ఫైర్..**

ఈ ఉద్యమానికి రాజకీయ సెగ కూడా తోడైంది. బుధవారం భువనగిరిలో జరుగుతున్న సమ్మె శిబిరానికి ఎంఎల్సీ తీన్మార్ మల్లన్న చేరుకుని కార్మికులకు సంఘీభావం తెలిపారు. దిన పత్రికలో వచ్చిన కథనాలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. నాడు మంత్రులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆర్టిజన్ల కష్టాలను చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు.. ఇప్పుడు అధికారంలోకి రాగానే నిధుల లేమి అంటూ సాకులు చెబుతున్నారా? అని ప్రశ్నించారు. రేపటి నుండి నేను హైదరాబాద్‌లోనే ఉంటాను.. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తా.. 20 వేల మందిని ఎలా తొలగిస్తారో నేను చూస్తాను అంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు.

# మహిళా బిల్లుకు ఓకే.. డీలిమిటేషన్ కు నో

- వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే
- ఖర్గే నివాసంలో ఇండి కూటమి భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:



పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను గురువారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ క్రమంలో పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమి దిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున బుధవారం భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఈనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని, మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, పార్లమెంటులో ఈ బిల్లుకు వ్యతిరేకంగా వోటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండి కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశపెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంటులో సమష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండి కూటమి అనుకూలమేనని, కానీ దానిని తీసుకొచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని ఖర్గే చెప్పారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు.

# రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:

తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా.. ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా అంటూ విపక్షాలకు ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. దిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. డబ్బున్న వాళ్లకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని, జీహెచ్ఎంసీ పరిధిలో 150 సీట్లను 300 చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని తెలిపారు.

## మహిళా రిజర్వేషన్లతోపాటు బీసీ బిల్లు పెట్టాలి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:

మహిళా రిజర్వేషన్‌తోపాటు బీసీలకు కూడా రిజర్వేషన్ పెట్టాలని ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పార్లమెంట్‌లో తమ గళం వినిపిస్తామన్నారు. ఇలానే జరిగితే తెలంగాణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలని ఎంపీ రవి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎంపీ తీవ్రంగా ఖండించారు. సీఎంను నోరు మూసుకుని కూర్చోమంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అహంకారపూరిత మాటలను ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యం అంటే కిషన్ రెడ్డికి విలువ లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మాటలను కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. భారత దేశం ఐక్యంగా ఉండాలని ఇద్దరు కాంగ్రెస్ ప్రధాన మంత్రులు ప్రాణత్యాగం చేశారని ఎంపీ గుర్తు చేశారు. దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు ఆమోదం కోసం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రం హడావుడి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను రెండింటినీ ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడం లేదని ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. ఈ రెండు అంశాలు ఒకదానికి ఒకటి సంబంధం లేనివని మల్లు తెలిపారు. రెండింటినీ విడదీసి వేరువేరుగా చర్చించి అమలుకు విధివిధానాలపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోనే పురుషులతోపాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది

# పాఠశాల స్థలానికి రక్షణ కల్పించాలి

- సీఎస్ఆర్ నిధులతో భవనం నిర్మించాలి
- అన్యాక్రాంతమైన స్థలాన్ని స్వాధీనపరచుకోవాలి
- విద్యా పరిరక్షణ కమిటీ, పూర్వ విద్యార్థుల ర్యాలీ, ధర్నా

హైదరాబాద్, ఏప్రిల్ 15 :

పటాన్‌చెరు జెడ్పీహెచ్ఎస్ స్థలాన్ని రక్షించాలని, కాంపౌండ్ వాల్‌తోపాటు పాత భవనాన్ని కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ, పటాన్‌చెరు పాఠశాల పూర్వ విద్యార్థుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఫ్రీడం పార్కు నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ముందు ధర్నా జరిపి తహసీల్దారుకు మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహ అధ్యక్షుడు అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షుడు వి.సోమశేఖర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరసింహారెడ్డి, పూర్వ విద్యార్థులు బైండ్ల కుమార్, శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ యాభ్యఏళ్లపాటు ఉన్నతంగా వెలుగొంది వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల స్థలానికి ఇలాంటి దుస్థితి రావడం శోచనీయమన్నారు. 13 ఏళ్ల క్రితం పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని విద్యార్థులను తాత్కాలికంగా ప్రాథమిక పాఠశాల భవనానికి తరలించారని, ఇన్నేళ్ళయినా నూతన భవనం నిర్మించకుండా ఇరుకైన, ఆట స్థలం కూడా లేని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోనే ఉన్నత పాఠశాలను కొనసాగించడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవకాశం దొరికినప్పుడల్లా ఆ స్థలాన్ని ఆక్రమించుకోవాలని కొందరు ప్రయత్నించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు అనుమతితో నిర్మించిన ప్రహరీని రాత్రికి రాత్రి కూల్చివేయడం చాలా దారుణమని, ప్రహరీ కూలుస్తుంటే పాత భవనం నేలమట్టమైందని తప్పుడు నివేదిక ఇవ్వడం అక్షేపణీయమని అన్నారు. సుప్రీం కోర్టులో సమర్థుడైన లాయర్‌ను ప్రభుత్వం నియమించి ఆ స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని, కోర్టు అనుమతితో ప్రహరీ నిర్మించినట్టే అదే స్థలంలో సీఆరఎస్ నిధులతో హైస్కూల్ భవనాన్ని నిర్మించి విద్యార్థుల భవిష్యత్తుకు మార్గం సుగమం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆక్రమించి గుడారాలు ఏర్పాటు చేసుకున్న 9 గుంటల పాఠశాల స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని జిల్లా అధికారులను డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, టీపీటీఎఫ్ జిల్లా నాయకులు రాజారెడ్డి, సంజీవయ్య, అశోక్, నాసర్ పటేల్, శ్రీనివాస్‌చారి, ప్రకాష్ రావు, మల్లికార్జున్, జనార్దన్, టీఎసఈసీ నాయకులు లక్ష్మి, మానస, శ్రీధర్ మహేంద్ర, మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాలు పటాన్‌చెరు నియోజకవర్గస్థాయి నాయకులు ఆశిష్ గౌడ్, విజయ్ కుమార్, ఆర్‌వీఎస్ రవి, వి.రామ్మోహన్, సీనియర్ జర్నలిస్టు రమేష్, నర్సింలు, నాగభూషణం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



# పాలనలో దేశంలోనే తెలంగాణ ఆదర్శం

మొదటిపేజీ తరువాయి

విక్రమార్క పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు చదువు, ప్రతి కుటుంబానికి ఆహార భద్రత, సాగునీరు అందించడమే ఈ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 14వేల సూపర్ స్పెషాలిటీ బెడ్లను అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. వైద్యం, విద్యను రెండు కళ్లుగా భావిస్తూ భారీగా పెట్టుబడులు పెడుతోందని ఆయన నొక్కి చెప్పారు. సత్తుపల్లి ప్రజల కోసం నిర్మించిన వంద పడకల హాస్పిటల్‌ను భట్టి విక్రమార్క రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రారంభించారు. నియోజకవర్గంలోనే అదనంగా కల్లూరులో 50 పడకల హాస్పిటల్‌ను, పెనుబల్లిలో 30 పడకల హాస్పిటల్‌ను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వైద్య విద్యను ప్రోత్సహించే దిశగా సత్తుపల్లిలో నర్సింగ్ కళాశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో రాష్ట్రవ్యాప్తంగా వందకు పైగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని, ఒక్కో పాఠశాలకు సుమారు రూ.200 కోట్లT వెచ్చిస్తున్నామని డిప్యూటీ



సీఎం తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించామన్నార􏰀T. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చదివే విద్యార్థుల డైట్ చార్జీలను 40% మేర, కాస్మెటిక్ చార్జీలను 200% మేర పెంచినట్లు వివరించారు. జూన్ 2 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయంపూట అల్పాహారంతోపాటు ఒక గ్లాసు పాలు, రాగి జావ అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో అనేక విద్యుత్ సబ్‌స్టేషన్లతోపాటు, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఎకో టూరిజం ప్రాజెక్టును కూడా ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లాలో గతంలో 4,11,143 రేషన్ కార్డులు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అదనంగా 57,088 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో కొన్ని దశాబ్దాలుగా 3,40,236 ఎకరాలకు సాగునీరు అందుతుండగా ప్రస్తుత ప్రభుత్వం అదనంగా 3,16,264 ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పన, పనుల కోసం ఇప్పటికే రూ.2,500 కోట్లు మంజూరు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. చదువుకున్న ప్రతి బిడ్డకు ఉద్యోగం, ప్రతి కుటుంబానికి ఆహార భద్రత సాగునీరు అందించడమే ఇందిరమ్మ రాజ్యపు ప్రధాన సంకల్పం అన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లు**

సొంత ఇంటి కల నెరవేర్చుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని, ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక సహాయమని తెలిపారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొత్తం 4,50,000 ఇళ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ప్రతి వారం తమ ఇంటి నిర్మాణ ప్రగతిని అప్‌లోడ్ చేస్తే,అధికారులు వెంటనే బిల్లులు చెల్లించేలా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

**పర్యాటక రంగం అభివృద్ధి**

సత్తుపల్లి సమీపంలోని పులిగుండాల చెరువు, కనకగిరి హిల్స్ ప్రాంతాన్ని ప్రపంచ పర్యాటక పటంలో నిలిచేలా ఎకో టూరిజం ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాంతం రాష్ట్రానికే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.



# మోదీకి మద్దతుగా నారీ ర్యాలీ

మొదటిపేజీ తరువాయి

ఎన్.రామచందర్ రావు హాజరయ్యారు. వందలాదిమంది మహిళలు, యువతులు ర్యాలీలో పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ బిల్లుపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్న క్రమంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో 'నారీ శక్తి వందన్ అధినియమ'పై చర్చ జరగబోతోందన్నారు. ఈ శుభ సందర్భంగా దేశవ్యాప్తంగా మహిళలు ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుతున్నారని, ఆ క్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా, యువమోర్చా ఆధ్వర్యంలో స్కూటీ ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ల అంశం ముప్పయ్యేళ్లుగా పెండింగ్‌లో ఉందని, యూపీఏ ప్రభుత్వ కాలంలో కాంగ్రెస్.. మిత్రపక్షాల ఒత్తిడితో ఈ బిల్లును ముందుకు తీసుకురాలేదని తెలిపారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ బిల్లును తిరిగి పార్లమెంటులో ప్రవేశపెడుతున్నా ఽంటూ కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లు అమలుకు అడ్డంకులు సృష్టించేలా కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ బిల్లు అమలవకుండా చేయాలనే దురుద్దేశంతో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇండీ అలయెన్స్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారని, ఆయన చేస్తున్నది పూర్తిగా తప్పుడు ప్రచారమని అన్నారు. ఇది దేశాన్ని విభజించే రాజకీయాలకు దారి తీసే చర్య అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మతం, కులం, ప్రాంతాల పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆయన రాసిన లేU కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉందని స్పష్టం చేస్తోందన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే స్పష్టంగా చెప్పినందున కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, ముఖ్యంగా తెలంగాణ ప్రజలు, దక్షిణాది ప్రజలు ఈ అబద్ధాల ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లపై పార్లమెంటులో చర్చించనున్న ఈ చరిత్రాత్మక సందర్భంలో తెలంగాణలోని మహిళలందరికీ రామచందర్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేడు లోక్ సభ ముందుకు డీలిమిటేషన్ బిల్లు

- **మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026 తీసుకొస్తున్న కేంద్రం**

న్యూఢిల్లీ:

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి అవసరమైన నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ ఈ బిల్లును సభ ముందుకు తీసుకురానున్నారు. బిల్లుపై అనంతరం చర్చ జరగనుంది.

ఈ బిల్లులో లోక్‌సభ స్థానాల సంఖ్యను గరిష్ఠంగా 850కి పెంచాలని కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి 815 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35 మంది సభ్యులు ఉండేలా ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకోసం రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్‌కు సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 543 స్థానాలకే లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్ల అమలుకు అనుగుణంగా 2029 నుంచి ఈ మార్పులు అమల్లోకి వచ్చేలా కేంద్రం ప్రణాళిక రూపొందిస్తోంది. జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్‌లు 55, 81, 82, 170 తదితరాలకు సవరణలు ప్రతిపాదించారు. ఈ ప్రక్రియను అమలు చేయడానికి సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిషన్ రాష్ట్రాల వారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల సంఖ్యను నిర్ణయించి, వాటి పునర్విభజన చేపడుతుంది. అయితే లోక్‌సభ స్థానాలను 850కి పెంచే విధానం ఏ ప్రాతిపదికన ఉంటుందనే అంశంపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. పార్లమెంటులో జరిగే చర్చల అనంతరం రాష్ట్రాల వారీగా స్థానాల పెంపుపై పూర్తి వివరాలు వెలువడే అవకాశం ఉంది.



## నిర్లక్ష్యం.. ప్రాణాంతకం

హైదరాబాద్, ఏప్రిల్ 15 :

అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రాణాంతకమవుతుందని శాంతిభద్రతల విభాగం అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం డిజిపి కార్యాలయంలో అగ్నిమాపక శాఖ అధికారులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారుపడకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించడం ద్వారా ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే 101 నంబరుకు సమాచారం అందిస్తూనే మంటలు చెలరేగగానే భవనాన్ని తక్షణమే ఖాళీ చేయాలని, కిందకు రావడానికి లిఫ్టులు వాడకుండా మెట్ల మార్గాన్ని ఎంచుకోవాలని స్పష్టం చేశారు. ఒకవేళ భవనంలో పొగ ఎక్కువగా వ్యాపిస్తే ఊపిరాడకపోయే ప్రమాదం ఉన్నపుడు నేల మీద పాకుతూ వెళ్లడం శ్రేయస్కరమని, ముక్కుకు తడిగుడ్డ కట్టుకుని సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలని వివరించారు. ఒంటికి మంటలు అంటుకుంటే పరుగెత్తకుండా వెంటనే నేలపై పడుకుని దొర్లడం ద్వారా మంటలను అదుపు చేయవచ్చని, అలాగే పాఠశాలలు, హాస్పిటల్స్, బహుళ అంతస్తుల భవనాల్లో భద్రతపై ప్రతి పౌరుడూ కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు.



# వడదెబ్బ బాధితులకు సత్వర చికిత్స

- **ప్రతి హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఒక బృందం**
- **ఆరోగ్య శాఖ అధికారులకు మంత్రి దామోదర్ ఆదేశాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 15:

ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ప్రభుత్వ దవాఖానలలో తాగు నీటి సౌకర్యం, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, వడదెబ్బ బాధితులకు చికిత్స ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి బుధవారం సమీక్షించారు. వడ దెబ్బ బాధితులకు తక్షణమే చికిత్స అందించేందుకు అన్ని హాస్పిటల్స్‌లో ఇప్పటికే ఏర్పాట్లు చేశామంటూ ఇన్, అవుట్ పేషెంట్ల కోసం చేసిన ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఇన్, అవుట్ పేషెంట్లు, వారి సహాయకులకు, హాస్పిటల్ సిబ్బందికి తాగు నీరు అందుబాటులో ఉంచాలని, పెద్ద హాస్పిటల్స్‌లో ప్రతి బ్లాక్, ప్రతి ఫ్లోర్‌లో తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఆవరణలో అవసరమైనచోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉక్కపోత సమస్య ఎక్కువ అవుతున్నందున ఇన్, అవుట్ పేషెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి, డాక్టర్లకు ఇబ్బంది కలగకుండా అవసరమైనచోట ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐసీయూలు, ఇతర వార్డుల్లో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దాతల సహకారం తీసుకోవాలని సూచించారు.

**అవగాహనతోనే నివారణ సాధ్యం**

హాస్పిటల్స్, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాలను ఎంపిక చేసుకుని వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించేందుకు అవసరమైన అంశాలు రూపొందించుకోవాలని చెప్పారు. యేటా ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కార్మికులు వడ దెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమాలు రూపొందించాలని, పట్టణాల్లో ఆటో, క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, ఇతర గిగ్ వర్కర్లకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని మంత్రి రాజనర్సింహ సూచించారు. వడదెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు అంకిత భావంతో పనిచేసే బృందాన్ని హాస్పిటల్ ఎమర్జెన్సీ ఏరియాలో సిద్ధంగా ఉంచాలని, ఈ బృందంలోని సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

**జనరేటర్లు సిద్ధంగా ఉండాలి**

వేసవిలో గాలి దుమారాలు, ఈదురు గాలులు, అకాల వర్షాలతో విద్యుత్ సరఫరాలో ఆటంకం కలగవచ్చని, ఇలాంటి సమయాల్లో రోగులకు ఇబ్బంది కలగకుండా వెంటనే జనరేటర్లు ఆన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు అన్ని హాస్పిటల్స్‌లో జనరేటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. వెంటనే వాటి పనితీరును పరిశీలించాలని, అవసరమైనచోట మరమ్మతులు చేయించాలని మంత్రి ఆదేశించారు.

**అగ్ని ప్రమాదాల ముప్పు**

వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే ముప్పు ఎక్కువగా ఉంటుందని, షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, ఈ నేపథ్యంలో అన్ని హాస్పిటల్స్‌లో పవర్ కేబుల్స్‌ను వెంటనే తనిఖీ చేయించాలని మంత్రి దామోదర్ ఆదేశించారు. అవసరమైనచోట పాత వాటి స్థానంలో కొత్త వైరింగ్ చేయించాలన్నారు. అన్ని హాస్పిటల్స్‌లో ఫైర్ అలార్మ్, స్మోక్ డిటెక్టర్స్ మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. అవసరమైనచోట కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. మంటలను ఆర్పే యంత్రాలు సరిపడ ఉన్నాయో లేవో చూడాలని, వాటి గడువు తేదీలను పరిశీలించాలని ఆదేశించారు. మంటలు ఆర్పే యంత్రాల వినియోగంపై హాస్పిటల్ సిబ్బంది, సెక్యూరిటీకి మరోసారి శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ, షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించి చేయాల్సిన, చేయకూడని పనుల గురించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీపంలోని ఫైర్ స్టేషన్ అధికారులతో హాస్పిటల్ అధికారులు సమన్వయం చేసుకుని ఫైర్ సేఫ్టీ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలన్నారు. సమీక్షలో ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ఉద్యమమే

- **డీలిమిటేషన్ రాజకీయ సవరణగా మిగలొద్దు**
- **మహిళా రిజర్వేషన్లకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు**
- **పునర్విభజనతో ముడిపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నాం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక**
- **రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్' ముఖ్యమంత్రి**
- **ఆయన రాజకీయ వైఖరిలో స్థిరత్వం లేదు**

హైదరాబాద్, ఏప్రిల్ 15 :

పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న డీలిమిటేషన్ బిల్లులో ఉన్న అస్పష్టతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్ల శాతం 24% గానే కొనసాగాలని, దీనిని మార్చే ప్రయత్నం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంతో ఆడుకుంటే తీవ్రమైన తిరుగుబాటు వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాలనను కేవలం రాజకీయాల మీద కాక ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని పలు న్యూస్ ఏజెన్సీలతోపాటు ఫిర్జాదిగూడ మీటింగ్‌లో మాట్లాడిన కేటీఆర్ సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడమే కాక అసెంబ్లీ, కౌన్సిల్‌లో ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేసిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50%, మార్కెట్ కమిటీల్లో 33% రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా మహిళా సాధికారత పట్ల తమకున్న అచంచలమైన నిబద్ధతను చాటుకున్నామన్నారు. అయితే మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్), రాజ్యాంగ సవరణలతో అనవసరంగా ముడిపెట్టడాన్ని కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. అత్యంత సరళమైన విషయాన్ని కేంద్రం ఎందుకు సంక్లిష్టం చేస్తోందని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయండి. పార్లమెంటులో 543 సీట్లు ఉన్నాయి, అక్కడ వర్తింపజేయండి. తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.. ఇక్కడా అమలు చేయండి. సీట్ల పెంపు, పునర్విభజనతో ముడిపెట్టి ఎందుకు అయోమయాన్ని సృష్టిస్తున్నారు అని నిలదీశారు. రాజ్యాంగ విధివిధానాల ప్రకారం మొదట జనగణన, తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, ఆ తర్వాతే నిర్మాణాత్మక మార్పులు జరగాలని కేటీఆర్ స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగని ఏ సహేతుకమైన ప్రతిపాదనకైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని, కానీ దక్షిణాదికి అన్యాయం చేసే ప్రయత్నం జరిగితే మాత్రం తీవ్రంగా ప్రతిఘటిస్తామని, అవసరమైతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లులో ఉన్న అస్పష్టతలపై ఆందోళన వ్యక్తం చేశారు. 50% సీట్లు పెరుగుతాయని కేంద్ర నేతలు చెబుతున్నప్పటికీ బిల్లులో మాత్రం ఆ ప్రస్తావన లేదన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై 202223 నుంచే బీఆర్ఎస్ గళమెత్తుతోందంటూ కేవలం జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. 1971లో పార్లమెంటు సీట్లపై విధించిన స్తంభన జనాభా నియంత్రణ ప్రాతిపదికన జరిగిందని కేటీఆర్ గుర్తు చేశారు. గత ఐదు దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేశాయని తెలిపారు. జాతీయ జనాభా విధానాన్ని తూచా తప్పకుండా పాటించినందుకు ఇప్పుడు మమ్మల్ని శిక్షిస్తారా అని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం సుమారు 24% ఉందని, ఈ శాతాన్ని ఏ స్థితిలోనైనా కాపాడాలని నొక్కి చెప్పారు. 0.01% శాతం తగ్గుదల కూడా మాకు ఆమోదయోగ్యం కాదు.. దీనిని మార్చే ప్రయత్నం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదన్నారు. ఈ ఆందోళనలను పట్టించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'మీరు ఒక నిప్పుల కుంపటి మీద కూర్చున్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంతో ఆడుకుంటే తీవ్రమైన తిరుగుబాటు వస్తుంది అని అన్నారు. ఇలాంటి చర్యలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలతో కలిసి పనిచేస్తామని చెప్పారు.

**రేవంత్ హైబ్రిడ్ ముఖ్యమంత్రి**


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పిస్తూ ఆయనను ఒక 'హైబ్రిడ్ ముఖ్యమంత్రి'గా కేటీఆర్ అభివర్ణించారు. రేవంత్ రాజకీయ వైఖరిలో స్థిరత్వం లేదని, ఉదయం ఆయన కాంగ్రెస్‌కు ప్రతినిధిగా ఉంటారు.. సాయంత్రానికి బీజేపీతో కలిసిపోతారు.. సహజంగానే ఇలాంటి హైబ్రిడ్ విధానం ఆయన పాలనలో కూడా కనిపిస్తోంది అని వ్యాఖ్యానించారు. ఇతరుల నుంచి నిబంధనలు కోరుతున్న ముఖ్యమంత్రి హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించే ప్రతిపాదన విషయంలో జీహెచ్ఎంసీ ప్రతినిధులు, జెడ్పీటీసీ సభ్యులు లేదా ఎమ్మెల్యేలను ఎందుకు సంప్రదించలేదని ప్రశ్నించారు. మీకో విధానం, ఇతరులకో విధానం అంటే కుదరదు. ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్ పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయకుండా స్పష్టతతో, బాధ్యతతో మాట్లాడాలి అని ఆయన హితవు పలికారు.

**ముప్పై నెలలు అవుతున్నా నెరవేరని హామీలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేండ్లు అయింది.. ఎన్నికలలో అడ్డగోలుగా హామీలకు గ్రామీణ అమాయకులు నమ్మి ఓట్లు వేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది అని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జిల్లా ప్రజలు మాత్రం కాంగ్రెస్ మాటలు నమ్మలేదని, ఒక్క సీటు కూడా వాళ్ళకు ఇవ్వలేదంటూ పీర్జాదిగూడ ప్రజలకు అభినందనలు తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ డివిజన్‌నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ లోకి చేరికల సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్తకు రూ.4000, కోడలికి రూ.2500 ఇస్తాం అన్నారు.. ఆషాఢం సేల్ లెక్క అడ్డగోలు హామీలు ఇచ్చుకుంటూ పోయారు. ముఖ్యమంత్రి గారూ.. మీరు ఇస్తామన్న స్కూటీలు ఎక్కడ, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఎక్కడ అని అడిగితే ఎంత కండలు తిరిగిన మొగోడు అయినా మూడు నెలల్లో పిల్లలు పుట్టించరు కదా అన్నాడన్నారు. అయితే మూడు నెలలు కాదు.. 30 నెలలు అయినా పుట్టకపోతే ఏం అంటారు అని కేటీఆర్



సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. ఆడ పిల్ల పుడితే రూ.13వేలు, మగ పిలగాడు పుడితే రూ.12వేలు ఇచ్చి తల్లీబిడ్డను ఇంటి దగ్గర దించి వచ్చేలా నాడు కేసీఆర్ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక పథకాలు రద్దయ్యాయని తెలిపారు. హైడ్రాబాద్‌లో ఎవరైనా సంతోషంగా ఉన్నారంటే ఇద్దరే ఇద్దరు.. ఒకరు దొంగలు, మరొకరు దోమలు అని కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. హైదరాబాద్‌లో ఎక్కడపడితే అక్కడ భూములు కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌కు దోమలబాదు, దోమలగూడ అని పేరు పెట్టమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రికి తాను అసెంబ్లీలో చెప్పానన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి తప్పించుకునే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. తప్పించుకునే పరిస్థితి లేదు.. వాళ్ళను కచ్చితంగా నిలదీయాలి అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణం భూమి పుట్టినప్పటి నుండి నడుస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టి ఎనిమిదేండ్లయింది.. ఈ ప్రాజెక్టు పని ఎక్కడిది అక్కడే ఉందని విమర్శించారు. తాము కడతాం అంటే లేదు లేదు తామే కడతాం అని కేంద్రం అన్నదన్నారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఈ జిల్లాలో మూడుకు మూడు క్లీన్ స్వీప్ చేశామన్నారు. సెప్టెంబర్‌లోనో అక్టోబరులోనో జీహెచఎంసీ ఎన్నికలు అంటున్నారు.. వాళ్లను గెలిపిస్తే ఇక్కడకు మళ్ళీ బుల్డోజర్ వస్తుంది.. అందుకే బీఆరఎస్‌కి ఓటు వేయాలి అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. మీకు అండగా ఉంటాం అని చెప్పారు.




సంపాదకీయం

# దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి!

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్ధత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్టమెంటులో సుదీర్ఘ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఓక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

# అమెరికాకు ఇరాన్ భారీ 'బిల్'!

- రూ. 25 లక్షల కోట్ల పరిహారం ఇస్తేనే శాంతి చర్చలు.. తెగేసి చెప్పిన టెహ్రాన్
- యుద్ధ నష్టం పూడ్చాల్సిందేనన్న ఇరాన్.. హోర్ముజ్ జలసంధిపై పన్ను విధింపు యోచన
- అమెరికాకు సహకరించిన ఐదు అరబ్ దేశాలకూ పరిహారం సెగ!
- చమురు, వాణిజ్య రంగాల్లో తీరని లోటు.. అంతర్జాతీయ సాయం కోసం ఇరాన్ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ (ఆంధ్ర మనం):** మెరికాతో రెండో విడత శాంతి చర్చలకు సిద్ధమవుతున్న తరుణంలో ఇరాన్ ఒక సంచలన డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. ఇటీవల జరిగిన యుద్ధం కారణంగా తమ దేశం సర్వస్వం కోల్పోయిందని, జరిగిన నష్టానికి పరిహారంగా అమెరికా దాదాపు 270 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 25 లక్షల కోట్లు) చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈ భారీ పరిహారంపై స్పష్టత వస్తేనే చర్చల్లో ముందుకు వెళ్తామని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు. యుద్ధం వల్ల జరిగిన విధ్వంసాన్ని తమ దేశం ఒంటరిగా భరించలేదని, అంతర్జాతీయ సమాజం తమకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఇరాన్ పేర్కొంది. యుద్ధం కారణంగా ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలు, నివాస గృహాలు, రవాణా వ్యవస్థలు పూర్తిగా ఛిన్నాభిన్నమయ్యాయి. ముఖ్యంగా దేశ ఆర్థిక వెన్నెముక అయిన చమురు రంగానికి, వాణిజ్య రంగానికి జరిగిన నష్టం అంచనాలకు అందడం లేదని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టాల గణన ఇంకా కొనసాగుతోందని, పరిహారం మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని టెహ్రాన్ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అమెరికా నుంచి ఆశించిన స్పందన రాకపోతే, ప్రత్యామ్నాయంగా కీలకమైన హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణించే అంతర్జాతీయ నౌకలపై ప్రత్యేకంగా 'యుద్ధ నష్ట పన్ను' విధించే అంశాన్ని కూడా ఇరాన్ పరిశీలిస్తోంది. ఇది ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు, యుద్ధ సమయంలో అమెరికా-ఇజ్రాయెల్ దళాలకు తమ భూభాగాలను ఉపయోగించుకోవడానికి అనుమతినిచ్చిన ఐదు అరబ్ దేశాలపై కూడా ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తమ దేశ విధ్వంసానికి పరోక్షంగా సహకరించిన ఆ దేశాలు కూడా పరిహారం చెల్లించాల్సిందేనని ఇరాన్ ఇప్పటికే డిమాండ్ చేసింది. శాంతి చర్చలకు ముందు ఇరాన్ పెట్టిన ఈ కఠిన నిబంధనలు ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికాను ఇరకాటంలో పడేశాయి. ఈ పరిహారం చెల్లింపుపై అమెరికా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో, ఇది శాంతి చర్చల భవిష్యత్తును ఎలా మారుస్తుందో అన్నది ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తికరంగా మారింది.

# నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- వాడీవేడీగా సాగనున్న సమావేశాలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్ర మనం)::** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నా యి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోదీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్ని కయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంత వరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించుకోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

# కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్,ఏప్రిల్15 (ఆంధ్ర మనం):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

# బంగ్లా పౌరుల పడవ మునక

- 250 మంది గల్లంతు.. ముమ్మర గాలింపు



ఢాకా, ఏప్రిల్ 15: అండమాన్ తీర సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉద్ధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా.. ఈ పడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.







# తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చే

# ఏకైక పార్టీ "బిఆర్ఎస్ "

## బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ లో చేరిన మాజీ కార్పొరేటర్ కౌడె పోచయ్య, విద్యావేత్త ఆకుల మధుకర్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు
- గులాబీ కండువాలు కప్పి స్వాగతించిన మాజీ మంత్రి కేటీఆర్
- బిఆర్ఎస్ పార్టీతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం: మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే పార్టీ బిఆర్ఎస్ పార్టీయే అని, ఈ పార్టీతోనే తెలంగాణ సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ కౌడె పోచయ్య, విద్యావేత్త ఆకుల మధుకర్, వెల్లంకి శశిధర్ రెడ్డి, దొంతిరి మధుసూదన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఒంటెరు మాధవ రెడ్డి, సోమిరెడ్డి తో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులను బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... దక్షిణాది రాష్ట్రాలపై డీలిమిటేషన్ పేరుతో అన్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. అలాంటి ప్రయత్నాలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. అవసరమైతే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని గుర్తుచేసిన కేటీఆర్, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. హైదరాబాద్‌లో భూకబ్జాలు పెరిగిపోయాయని, ప్రజలకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు సంవత్సరాలుగా సాగుతూనే ఉన్నాయని, కేంద్రం–రాష్ట్రాల మధ్య సమన్వయం లోపంతో అభివృద్ధి నిలిచిపోయిందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మళ్లీ బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్,దొంతిరి హరిశంకర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి,మైనారిటి అధ్యక్షులు జిలాని పాష, జావీద్ ఖాన్, మాజీ మేయర్లు సామల బుచ్చిరెడ్డి, మేకల కావ్య, పోచారం మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, మీసాల కృష్ణ, కొండల్ రెడ్డి, శేఖర్, మాధవ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రమేష్, పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం, ఘట్కేసర్ నాయకులు మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ కళా దినోత్సవ వేడుకలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లిలో భక్త రామదాసు ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ కళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. తదనంతరం సంఘం సభ్యులు కేక్ కటింగ్ చేశారు.ఖమ్మం జిల్లా కళాకారుల సంఘం తెల్లగొర్ల లింగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ,, ఇటలీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు లియొనార్డో డావెన్సీ పుట్టినరోజు సందర్భంగా ఆయన గౌరవార్థం ఈ ప్రపంచ కళా దినోత్సవం 2012 నుండి నిర్వహిస్తున్నారని తెలియజేశారు. కళ అనగా సృజనాత్మకత, ప్రతిభ అని అన్నారు. ప్రపంచంలో 64 కళలు ఉన్నాయని ఎవరి కళలో వాళ్ళు ముందుకు వెళ్లాలని తెలియజేశారు. కళలు ఉండడంవల్ల మనసులో ఉత్సాహం పెరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ నంది అవార్డు గ్రహీత కవి సామ్రాట్ చిలకాబత్తిని వీరబాబు, బిజెపి పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వంగూరి ఆనందరావు, తునికి పార్టీ లక్ష్మణాచారి, ఏపూరి సత్యనారాయణ,భిక్షం నాయక్, సూరేపల్లి జ్ఞానరత్నం, కట్టెకోల వెంకటేశ్వర్లు, కుక్కల ప్రభాకర్, లొడంగి కొండలు, లక్ష్మణ చారి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్పంతో వచ్చిన ఎస్సై రాములకు ఆత్మీయ సత్కారం

**బీర్కూర్, రాజముద్ర న్యూస్:** బీర్కూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాములను కిష్టాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు పూలమాలలు వేసి, శాలువాతో గౌరవించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మియాపురం శశికాంత్ మాట్లాడుతూ, కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాములు ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని, మండలంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, న్యాయపరమైన సేవలు అందిస్తారని నమ్మకం వ్యక్తం చేశారు.ఎస్సై రాములు మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పోలీస్ వ్యవస్థపై విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరితో సమానంగా వ్యవహరిస్తూ న్యాయం జరిగేలా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాన్సువాడ మనెవ్వ గంగోండ, శ్రీనివాస్ జెట్టి, బాన్సువాడ సాయిలు, ఎన్నువార్ రాధాకృష్ణ, ఎంగాయి సత్యం, కానూరి భరత్ కుమార్, గంజాయి అంజయ్య, లింగాపురం రవి, గౌస్ చందు గౌడ్ , కర్ణం శ్రీను, మంద గంగాధర్, పండరీపురం రాములు, బేగారి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.




## దుద్దాగులో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే యాదయ్య

### హాజరైన గ్రామ సర్పంచ్ కావలి లక్ష్మీ ప్రసన్న శేఖర్



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల మండల పరిధిలోని దుద్దాగు గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన గూడెం చంద్రకళ, ఇందిరమ్మ ఇంటిని గ్రామ సర్పంచ్ కావలి లక్ష్మీ ప్రసన్న శేఖర్ తో కలిసి ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదల గృహ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతేకాకుండా పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలంటే సొంత ఇల్లు అత్యవసరమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ సర్పంచ్ కావలి లక్షి ప్రసన్న మాట్లాడుతూ... ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెంటయ్య గౌడ్, చేవెళ్ల మండల నాయకులు, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పడాల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ న్యాలట బుచ్చయ్య, సింగప్పగూడెం సర్పంచ్ రవి, తల్లారం, దుద్దాగు, ఉప సర్పంచ్ మొహమ్మద్ నవాజ్, వార్డు నెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# "సేవల స్ఫూర్తి- బీర్కూర్ లో ప్రభుత్వ శాఖల ప్రగతి"




**బీర్కూర్, రాజముద్ర న్యూస్:** బీర్కూర్ మండలం ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరవేయడంలో స్థానిక కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి నుంచి వ్యక్తిగత అవసరాల పరిష్కారం వరకు ప్రతి విభాగం ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోంది. పారదర్శకత, వేగం, బాధ్యతాయుత సేవలతో ఈ కార్యాలయాలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయి. మండల తహసీల్దార్ కార్యాలయం ఆదాయ ధ్రువపత్రాలు, కుల ధ్రువపత్రాలు, పాస్‌బుక్ సమస్యలు వంటి అంశాల్లో ప్రజలకు తక్షణ సేవలు అందిస్తోంది. భూమి సంబంధిత వివాదాల పరిష్కారంలోనూ కీలకంగా వ్యవహరిస్తోంది. అలాగే, ఎంపీడీవో కార్యాలయం గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పథకాల అమలు, శుచిత, నీటి సరఫరా వంటి అంశాల్లో ముందుండి పనిచేస్తోంది. వ్యవసాయ శాఖ రైతులకు ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పిస్తూ, విత్తనాలు, ఎరువుల సరఫరాలో సహాయం చేస్తోంది. పంటల దిగుబడి పెంపు కోసం సలహాలు ఇస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. ఆరోగ్య శాఖ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను అందిస్తూ, టీకాలు, ఆరోగ్య శిబిరాల ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతోంది. పోలీస్ శాఖ ప్రజల భద్రతను కాపాడటంలో కీలకంగా వ్యవహరిస్తూ, చట్టవ్యవస్థను క్రమబద్ధంగా కొనసాగిస్తోంది. ట్రాఫిక్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంచుతోంది. విద్యాశాఖ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో కృషి చేస్తోంది. ఇదే విధంగా, పంచాయతీ రాజ్ శాఖ గ్రామాభివృద్ధి పనుల్లో ముందుండి, రోడ్లు, డ్రైనేజ్, శుద్ధి పనులను వేగవంతం చేస్తోంది. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆంగన్‌వాడీల ద్వారా పిల్లల పోషణ, మహిళల సంక్షేమానికి సేవలు అందిస్తోంది. ఈ విధంగా బీర్కూరు మండలం లోని ప్రతి కార్యాలయం తన పరిధిలో ప్రజలకు సేవలందిస్తూ, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. సమన్వయం, సేవాభావం, ప్రజల అవసరాలపై దృష్టి—ఇవే ఈ కార్యాలయాల విజయానికి మూలస్తంభాలు.

# పిడిఎఫ్ బియ్యం పట్టివేత



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం జగదంబ తండా చౌరస్తాలో ఉదయం పోలీసులు వెహికల్ చెకింగ్ చేస్తుండగా మాచారెడ్డి మండలానికి చెందిన జూలూరి శ్రీ చరణ్, దూదేళ్ళ రమేష్ మారుతి , ఓమిని, రెండు వాహనాలలో దాదాపు 8 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

# యువ శక్తికి ప్రతీక శ్రీకాంత్ రెడ్డి

## మార్గదర్శకులు వంచ నరసింహారెడ్డి, పద్మ... కాంగ్రెస్ పట్ల నిబద్ధత... ప్రజల కోసం అంకితభావం

**మెదక్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15 రాజముద్ర న్యూస్:**



ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో యువ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తున్న వేళ, యువజన నాయకుడు శ్రీకాంత్ రెడ్డి తన కృషి, కట్టుబాటు, ప్రజలతో అనుబంధం ద్వారా ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు. తల్లితండ్రుల వారసత్వాన్ని మార్గదర్శకత్వంగా తీసుకుని వంచ నరసింహారెడ్డి, పద్మ చూపిన దారిలో నడుస్తూ కుటుంబానికి ఉన్న రాజకీయ విలువలను మరింత బల పరుస్తున్నారు. వారి నుంచి నేర్చుకున్న సేవా భావం, క్రమశిక్షణ, ప్రజల పట్ల బాధ్యత ఇవన్నీ శ్రీకాంత్ రెడ్డి వ్యక్తిత్వంలో స్పష్టంగా కనిపిస్తాయి.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత అసాధారణం. పార్టీ పిలుపు వచ్చిన ప్రతిసారీ ముందుండి పనిచేయడం ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనడం పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేయడం ఆయన లక్షణాలు. అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీ పట్ల విధేయత తగ్గకుండా నిజమైన కార్యకర్తగా నిలబడటం ఆయన ప్రత్యేకత.నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అడుగుజాడల్లోనే శ్రీకాంత్ రెడ్డి నడుస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్నారు. నాయకత్వంలో అనుభవం ప్రజలతో అనుబంధం ఎలా ఉండాలో రాజిరెడ్డి చూపిన మార్గాన్ని అనుసరిస్తూ యువ నాయకుడిగా తన ప్రత్యేకతను చాటుతున్నారు.శ్రీకాంత్ రెడ్డి యువతలో సంపాదించిన ఆదరణ విశేషం. ఆధునిక ఆలోచనలతో పాటు సామాజిక బాధ్యతను కలగలిపి యువతను ఆకర్షిస్తున్నారు. యువజన సమస్యలను సమీపంగా అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ఆయన యువత హృదయాలను గెలుచుకున్నారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై యువతతో చర్చిస్తూ వారిని చైతన్యవంతం చేస్తున్నారు.బండ పోసాని పల్లి గ్రామం, వెల్దుర్తి మండలం, మెదక్ జిల్లాలో గ్రామ అభివృద్ధికి శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. గ్రామంలో యువతను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలో మద్యపానం నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకుని మద్యపానం వల్ల జరిగే ఆర్థిక, ఆరోగ్య నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన ఒక మంచి ఆలోచనను ప్రజలతో పంచుకున్నారు "ప్రతిరోజు మీరు చేసే చిన్న చిన్న మార్పులు, భవిష్యత్తులో పెద్ద విజయాలకు, సమాజ పునర్నిర్మాణానికి దారి తీస్తాయి" అని పేర్కొన్నారు. ఈ సందేశం ద్వారా వ్యక్తిగత మార్పు ద్వారానే సమాజంలో గొప్ప మార్పు సాధ్యమని ఆయన తెలియజేశారు.ప్రజా సమస్యల విషయంలో ఆయన చూపే చొరవ ఆయన నాయకత్వానికి అద్దం పడుతుంది. ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం కోసం కృషి చేస్తారు. "నేనున్నాను" అనే నమ్మకాన్ని ప్రజల్లో నింపుతూ ముందుకు సాగుతున్నారు.ఇక ప్రజల్లో రాజకీయ చైతన్యం పెంచేందుకు కూడా శ్రీకాంత్ రెడ్డి కృషి చేస్తున్నారు. డబ్బుకి లొంగకుండా ఒక్కసారి ఆలోచించి నిజమైన నాయకుడిని ఎన్నుకోవాలని ప్రజలను చైతన్యవంతం చేస్తూ బాధ్యతాయుతమైన ఓటింగ్‌కు ప్రేరేపిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి నాయకత్వం ఎదగాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు.కార్యకర్తల పట్ల ఆయనకు ఉన్న అనుబంధం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వారిని కుటుంబ సభ్యుల్లా భావిస్తూ, వారి సమస్యలను తనవిగా తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారు. కార్యక్రమాల నిర్వహణలో కార్యకర్తలను ప్రోత్సహిస్తూ పార్టీని బలోపేతం చేస్తున్నారు.ఈ విధంగా మార్గదర్శకుల ఆశయాలను కొనసాగిస్తూ, ఆవుల రాజిరెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ యువతలో ప్రేరణగా నిలుస్తూ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే నాయకుడిగా ఎదుగుతున్న శ్రీకాంత్ రెడ్డి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించడం ఖాయం అని పార్టీ శ్రేణులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు.




# సాన్స్ స్కిన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

## ప్రారంభించిన సిఐ మీర్ ముదస్సర్ అలీ

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డు పోలీస్ స్టేషన్ పక్కన రామంతపూర్ వార్డులో గల సాన్స్ స్కిన్ అండ్ హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం సీఐ మీర్ ముదస్సర్ అలీ ప్రారంభించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ...వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దహార్తిని తీర్చడం అభినందనీయమని తెలిపారు.ఎస్సై మంజుల మాట్లాడుతూ.. చలివేంద్రాన్నిప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన డాక్టర్ సాయి సింధును సీఐ, ఎస్ఐలు అభినందించారు. డా. సాయి సింధు మాట్లాడుతూ....ఎండల తీవ్రత రోజు రోజుకు పెరిగిపోతుందని, నిత్యం పరిసర గ్రామాల నుంచి పట్టణానికి వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. . ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, పాషా, తేజ ఉన్నారు.

# గ్రామస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ఎంపీడీవో వెంకయ్య గౌడ్

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యంగా ప్రజా పాలన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, గ్రామస్థాయిలో జరుగుతున్న పనుల పురోగతి పై సమీక్షించారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా సూచనలు ఇచ్చిన ఎంపీడీవో వెంకయ్య.

**ఎంపీడీవో మాట్లాడుతూ...**

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని గ్రామస్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అలాగే అధికారులు తమ తమ పరిధిలో జరుగుతున్న పనులపై నివేదికలు సమర్పించారు. అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశం ద్వారా మండలంలోని అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగవంతం చేయాలని నిర్ణయించారు.

# అశ్వారావుపేటలో రోడ్డు భద్రత సూచనలు



- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో అవగాహన కార్యక్రమం
- ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పిలుపు

**అశ్వారావుపేట, ఏప్రిల్ 15 రాజముద్ర న్యూస్:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం అరేవ్ అలేవ్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ సందర్భంగా వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్ వినియోగం, వేగ నియంత్రణ వంటి అంశాలపై వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, డీఎస్పీ సతీష్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ జూపల్లి శశికళమ్మ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ కిషోర్, ఎంపీడీవో అప్పారావు, మండల విద్యాశాఖ అధికారి పి ప్రసాదరావు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకపల్లి వీరభద్రరావు, సీఐ నాగరాజు, ఎస్ఐ యయాతి రాజు, తాడేపల్లి రవి, జూపల్లి ప్రమోద్, తుమ్మ రాంబాబు, సూరపనేని ఫణి, పసుపులేటి ఫణింద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పెదవాగు నిధుల పోరాటం



- కేంద్ర గోదావరి రివర్ బోర్డు చైర్మన్ ను విన్నవించిన రైతులు
- రింగుబండ తాత్కాలిక చర్యలు మాత్రమే
- పూర్తిస్థాయి పనులు చేపట్టాలని రైతుల వేడుక
- నిధులు కేటాయింపుతో సమస్యకు పరిష్కారం

**అశ్వారావుపేట, ఏప్రిల్ 15 రాజముద్ర న్యూస్:**

పెదవాగు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులంతా కలిసి కేంద్ర గోదావరి రివర్ బోర్డు చైర్మన్ ను విన్నవించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువ నాయకులు బండి చెన్నారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ప్రాజెక్టు గండిపడటంతో ప్రభుత్వం రింగుబండ నిర్మించి తాత్కాలిక చర్యలు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయి పనులు ఇంకా ప్రారంభం కాలేదు.తెలంగాణ, ఆంధ్ర ప్రాంత రైతులు పెద్దవాగు ప్రాజెక్టు కింద అనేక ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అయితే పురాతన ప్రాజెక్టు భారీగా దెబ్బతినడంతో సాగు భూములు తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. రింగుబండ ఏర్పాటు చేసినా సమస్యకు పూర్తిస్థాయి ఉపశమనం కలగకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, నాయకులను పలుమార్లు రైతులు ఆశ్రయించినా సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకలేదు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమన్వయంతో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నిధులు కేటాయిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు స్పష్టం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం కేంద్ర గోదావరి రివర్ బోర్డు చైర్మన్ ను ప్రాజెక్టు వద్దనే కలిసి బండి చెన్నారెడ్డి నేతృత్వంలో రైతులు సమస్యలను వివరించారు. ప్రాజెక్టును పరిశీలించిన చైర్మన్ నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే పనులు ప్రారంభించే దిశగా కృషి చేస్తానని చెప్పినట్టు తెలిపారు.రైతులు ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నిధులు కేటాయిస్తే పనులు చకచకా పూర్తయ్యే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఏఈ, డి ఈ, ఎస్ సి, ఎస్ ఈ, రైతులు చెమడ బోయిన చిన్న వెంకటేశ్వరరావు, పదిలం సత్తిబాబు, సాయిల రవి, కరాటే రవి, వేముల చిన్న వెంకటేశ్వరరావు, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దళారుల మోసాలకు బలవద్దు



- రెండో విడత ఇందిరమ్మ ఇళ్లపై స్పష్టత లేదు
- డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణ
- అధికారులను సంప్రదించాలని సూచన

**సుజాతనగర్, ఏప్రిల్ 15 రాజముద్ర న్యూస్:**

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పేరుతో జరుగుతున్న దుష్ప్రచారం, దళారుల మోసాలను నమ్మవద్దని బిజెపి జిల్లా నాయకులు భూక్య రాజేష్ నాయక్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి అధికారిక నోటిఫికేషన్ లేదా మార్గదర్శకాలు విడుదల చేయలేదని తెలిపారు.అయినప్పటికీ కొందరు గ్రామాల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.సందేహాలు ఉంటే మండల అధికారులను సంప్రదించి నిజమైన సమాచారం తెలుసుకోవాలని ఆయన సూచించారు.

# మహాసభల జయప్రదం పిలుపు



**అశ్వారావుపేట, ఏప్రిల్ 15 రాజముద్ర న్యూస్:**

ఈ నెల 23 నుంచి 25 వరకు జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నిర్వహించనున్న ఏఐకేఎస్ అనుబంధ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య సంఘ శ్రేణులకు పిలుపునిచ్చారు.బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం సుందరయ్య భవన్‌లో మండల అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పుల్లయ్య మాట్లాడుతూ మహాసభలో తెలంగాణ కొబ్బరి బోర్డు ఏర్పాటు, పామాయిల్ రీఫైనరీ ఏర్పాటు అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యల పరిష్కారానికి ఈ మహాసభలు కీలకమని, సంఘ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో సంఘ నాయకులు సీసం రాము, కలపాల భద్రయ్య, మడకం శాంతి, మడివి దుర్గారావు, నారం అప్పారావు, నారం సీతమ్మ, సంతపురి చన్నారావు, జల్లి ముత్యాలు పాల్గొన్నారు.



## జాతీయ హాకీ శిబిరానికి తెలంగాణ ప్లేయర్లు

**హైదరాబాద్ :** జాతీయ హాకీ శిబిరానికి రాష్ట్రానికి చెందిన హర్ష్‌కుమార్, వీణ ఎంపికయ్యారు. రాంచీ వేదికగా ఇటీవల ముగిసిన జాతీయ సబ్‌జూనియర్ హాకీ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన హర్ష్‌కుమార్, వీణ భోపాల్ సాయ్ సెంటర్‌లో శిక్షణ పొందనున్నారు. ఈనెల 19 నుంచి మొదలయ్యే క్యాంప్ ద్వారా అండర్-18 జూనియర్ ఆసియా కప్ టోర్నీకి భారత జట్లను ఎంపిక చేయనున్నారు. వచ్చే నెల 29 నుంచి జూన్ 6వ తేదీ వరకు జపాన్ వేదికగా ఆసియా కప్ హాకీ టోర్నీ జరుగనుంది.



## అజింక్య రహానేకు 12 లక్షల జరిమానా

**చెన్నై:** కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానే కు ఫైన్ పడింది. అతనికి 12 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఫైన్ వేశారు. ఈ సీజన్‌లో కోల్‌కతా పర్ఫార్మెన్స్ మరీ దారుణంగా ఉంది. ఇప్పటి వరకు ఆ జట్టు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో 32 రన్స్ తేడాతో కోల్‌కతా ఓటమి పాలైంది. టాటా ఐపీఎల్‌లో భాగంగా జరిగిన 22వ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా రహానేకు ఫైన్ వేసినట్లు ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో చెప్పింది. ఈ సీజన్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద తొలిసారి నేరంగా పరిగణిస్తూ ఆ ఫైన్ వేసినట్లు చెప్పారు. శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో తన తదుపరి మ్యాచ్ కోల్‌కతా ఆడనున్నది.

## ముంబై ఇండియన్స్‌కు ‘హిట్ మ్యాన్’ షాక్!


### గాయంతో రెండు మ్యాచ్‌లకు రోహిత్ దూరం



**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్‌లో ఇప్పటికే వరుస ఓటములతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ జట్టుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు సీనియర్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గాయం కారణంగా రాబోయే కనీసం రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదని సమాచారం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో రోహిత్ కండరాలు పట్టేయడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో ఆయన ‘రిటైర్డ్ హర్ట్’గా వెనుదిరగాల్సి వచ్చింది. స్కానింగ్ నివేదికల అనంతరం, వైద్యుల సూచన మేరకు మేనేజ్‌మెంట్ ఆయనకు విశ్రాంతిని ప్రకటించింది. ఐపీఎల్ ముగిసిన వెంటనే భారత జట్టు అంతర్జాతీయ సిరీస్‌లు ఆడాల్సి ఉండటంతో, రోహిత్ గాయంపై బీసీసీఐ కూడా దృష్టి సారించింది. రోహిత్ గాయం తీవ్రత పెరగకుండా చూడాలని, త్వరగా కోలుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని ముంబయి ఫిజియోలకు బోర్డు సూచించినట్లు తెలుస్తోంది. బీసీసీఐ వైద్య బృందం నిరంతరం రోహిత్ ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోంది. మరోవైపు సోషల్ మీడియా వేదికగా రోహిత్ శర్మ త్వరగా కోలుకుని క్రీజులోకి రావాలని క్రికెట్ అభిమానులు ప్రార్థిస్తున్నారు. రోహిత్ లేని లోటును ముంబయి ఇండియన్స్ ఎలా భర్తీ చేస్తుందో తదుపరి

# బెంగళూరు భళా!

## రాయల్ ఛాలెంజర్స్ గెలుపు మోత



**లక్నో సూపర్ జెయింట్స్ పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం**

**బంతితో చెలరేగిన రసిఖ్ సలామ్, భువనేశ్వర్ కుమార్**

**బ్యాట్ తో అదరగొట్టిన విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్**

**29 బంతులు మిగిలి ఉండగానే లక్ష్య ఛేదన**

**బెంగళూరు :** ఐపీఎల్ టోర్నీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అదరగొట్టింది. తమ సొంత గడ్డ చిన్నస్వామి స్టేడియం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించి ప్రత్యర్థిని చిత్తు చేసింది. పక్కా వ్యూహంతో బరిలోకి దిగిన బెంగళూరు బౌలర్లు ముందుగా లక్నోను సాధారణ స్కోరుకే పరిమితం చేయగా.. ఆ తర్వాత బ్యాటర్లు ఆ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించారు. రన్ రేట్ మెరుగుపరుచుకోవాలన్న కసితో ఆడిన బెంగళూరు జట్టు మరో 29 బంతులు మిగిలి ఉండగానే ఆటను ముగించడం విశేషం.

### రాణించిన రసిఖ్, భువీ

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన బెంగళూరు జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 146 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్ 32 బంతుల్లో 40 పరుగులు, ముకుల్ చౌదరి 28 బంతుల్లో 39 పరుగులు, ఆయుష్ బదోని 24 బంతుల్లో 38 పరుగులతో ఫర్వాలేదనిపించారు. వీరు క్రీజులో కుదురుకున్నట్లే కనిపించినా భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. బెంగళూరు బౌలర్లు కచ్చితమైన లైన్ లెంగ్త్ తో బంతులు విసరడంతో లక్నో బ్యాటర్లు భారీ షాట్లకు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా యువ బౌలర్ రసిఖ్ సలామ్ కేవలం 24 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు తీసి లక్నో పతనాన్ని శాసించాడు. అతనికి తోడుగా సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ 3 వికెట్లతో చెలరేగాడు. కృనాల్ పాండ్యా 2 వికెట్లు పడగొట్టి లక్నోను కట్టడి చేశారు.



### విరాట్ కోహ్లీ మెరుపులు.. పాటిదార్ సుడిగాలి

అనంతరం 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టు కేవలం 15.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసి లక్ష్యాన్ని ముద్దాడింది. ఓపెనర్ విరాట్ కోహ్లీ 34 బంతుల్లో 49 పరుగులు చేసి తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. అతడి బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ జట్టు విజయానికి గట్టి పునాది వేసింది. మిడిలార్డర్ లో రజత్ పాటిదార్ కేవలం 13 బంతుల్లో 27 పరుగులు చేసి స్కోరు బోర్డును ఉరుకులు పెట్టించాడు. చివర్లో జితేష్ శర్మ 9 బంతుల్లో 23 పరుగులతో విరుచుకుపడి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు తీసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అవేష్ ఖాన్ 2 వికెట్లు పడగొట్టాడు. పిచ్ పరిస్థితులను ముందే అంచనా వేసిన బెంగళూరు సారథి బౌలింగ్ ఎంచుకుని సగం విజయాన్ని అక్కడే ఖాయం చేసుకున్నాడు. పవర్ ప్లేలో పరుగులు కట్టడి చేయడంతో పాటు లక్నో బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టడంలో బెంగళూరు బౌలర్లు పూర్తి స్థాయిలో సఫలమయ్యారు. ఛేదనలో కోహ్లీ అనుభవం జట్టుకు ఎంతో అక్కరకొచ్చింది. ఎక్కడా తడబడకుండా లక్ష్యం వైపు దూసుకుపోవడంతో లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం దక్కలేదు.









# అంతర్జాతీయ అరంగేట్రం

### ఆ స్టార్ ఆటగాళ్ల టీ20 స్థానం ప్రమాదంలో?

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ మరోసారి యువ ప్రతిభకు వేదికగా నిలుస్తోంది. ఇటీవల ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్ వంటి కొత్త ఆటగాళ్లు రాణించిన నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై పడింది. వరుసగా రెండు ఐపీఎల్ సీజన్లలో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రానికి దగ్గరయ్యాడు. కేవలం 12 మ్యాచ్‌ల ఐపీఎల్ కెరీర్ లోనే సూర్యవంశీ 452 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. స్ట్రైక్ రేట్ 228.28 చూస్తే వైభవ్ బౌలర్లపై ఎలా విరుచకపడుతాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ దూకుడుతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన వైభవ్, ఐర్లాండ్ పర్యటనకు ఎంపికయ్యే అవకాశాలు బాగా కనిపిస్తున్నాయి. ఇదే నిజమైతే.. కేవలం 15 ఏళ్ల వయసులోనే సూర్యవంశీ టీమ్ ఇండియాలోకి వస్తే, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టి, భారత జట్టుకు ఆడిన అతి పిన్న వయస్కుడిగా రికార్డ్ ను దక్కించుకుంటాడు. టెండూల్కర్ 16 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. అయితే, అతని ఎంపికలో ప్రధాన సమస్య టాప్ ఆర్డర్ లో చోటు కల్పించడం. ప్రస్తుతం టీమిండియాకు అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ డ్యాషింగ్ ఓపెనర్లు ఉండనే ఉన్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 విజయానంతరం వీరు జట్టుకు మరింత కీలకంగా మారారు. అయితే సాధారణంగా ఐర్లాండ్ పర్యటనలో సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి, కొత్త ఆటగాళ్లను పరీక్షించే అవకాశం బీసీసీఐ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీనియర్లకు రెస్ట్ ఇస్తే సూర్యవంశీ ఓపెనర్ గా ఆడే అవకాశం దక్కించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే అతి త్వరలో అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ కెరియర్ లో భారీ మార్పులు రానున్నాయి. చుడాలిమరి సెలెక్టర్లు






# ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి

భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి

రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నెసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.




## సర్ మరో అవకాశం ఇవ్వండి

బుచ్చిబాబు పోస్ట్.. వైరల్



ప్రస్తుతం అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ పెద్దితో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా రామ్‌చరణ్ 'ఎస్క్వైర్ ఇండియా' కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోల్లో చరణ్ స్టైలిష్ లుక్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. దీనికి దర్శకుడు బుచ్చిబాబు చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'సర్.. మరో అవకాశం ఇవ్వండి' అని సరదాగా కామెంట్ చేశారు. ఈ చిన్న కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీంతో 'పెద్ది' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని వార్తలు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ సినిమా తీయమంటూ అభిమానులు కూడా రిప్లైలు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ పెద్దిపై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమాలోని పాటలు ఆదరణను సొంతం చేసుకోవడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

## అర్ధరాత్రి ఫోన్ చేసి..

కయాదు లోహర్

తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కాయాదు లోహర్ తాజాగా ఓ ప్రైవేట్ ఆల్బమ్‌తో మరోసారి వార్తల్లో నిలిచింది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె 'పళవ మల్లి' అనే పాటలో నృత్యంతో ఆకట్టుకుంది. 'డ్యూడ్' చిత్రంతో సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన సాయి అభ్యంకర్ ఈ పాటకు స్వరాలు అందించారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ పాటలో అవకాశం ఎలా వచ్చిందో కాయాదు లోహర్ వివరించింది. ఒక రోజు అర్ధరాత్రి సమయంలో సాయి అభ్యంకర్ ఫోన్ చేసి పాట గురించి వివరించారని తెలిపింది. ఆ సమయంలో కాల్ రావడంతో ఆశ్చర్యపోయానని, అనంతరం ఆయన పాట వినిపించగా బాగా నచ్చడంతో వెంటనే అంగీకరించినట్లు చెప్పింది. పాటకు ఒప్పుకోవడం సులభంగా అనిపించినప్పటికీ, దాని కోసం చాలా శ్రమించాల్సి వచ్చిందని వెల్లడించింది. ఒకవైపు రిహార్సల్స్ నిర్వహిస్తూ, మరోవైపు సినిమా షూటింగ్‌లను సమన్వయం చేయాల్సి వచ్చిందని తెలిపింది. కొన్ని సందర్భాల్లో రాత్రి 2 గంటల వరకు చిత్రీకరణ జరిగినట్లు పేర్కొంది. ఈ పాట అద్భుతంగా రావడానికి మొత్తం బృందం కష్టపడిందని, ఆ కృషికి ఫలితంగా ఇప్పుడు ఈ పాటకు మిలియన్లలో వ్యూస్ లభిస్తున్నాయని కాయాదు లోహర్ వివరించింది.



## నన్ను నమ్మి.. నడిపించిన నా దేవత

భార్య రహస్య గోరఖ్‌పై కిరణ్ ప్రశంసలు



యువ హీరో కిరణ్ అబ్బవరం ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆయన సమర్పణలో రూపొందిన 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ద్వారా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సుమారు 25 మందికి పైగా కొత్త నటీనటులను, దర్శకుడు వి. మునిరాజ్‌ని పరిశ్రమకు పరిచయం చేస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ ఎంతో భావోద్వేగభరితంగా సాగింది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం చేసిన ప్రసంగం అందరినీ కదిలించింది. 'ఈ సినిమా కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. పల్లెల నుంచి పెద్ద కలలతో వచ్చిన సుమారు 50 మంది టెక్నీషియన్లు, నటీనటుల జీవిత స్వప్నం' అని ఆయన తెలిపారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు ఎవరినీ సహాయం కోరలేదని చెప్పిన కిరణ్, ఈసారి మాత్రం కొత్తవారి కష్టానికి గుర్తింపు రావాలనే ఉద్దేశంతో పరిశ్రమ పెద్దలు, విమర్శకులు ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఈ వేడుకలో ఆయన తన భార్య, నటి రహస్య గోరఖ్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. తాను హీరో కాకముందు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ, ఆ సమయంలో రహస్య తనకు అండగా నిలిచిందని చెప్పారు. అవకాశాల కోసం తిరిగిన రోజుల్లో కూడా ఆమె నన్ను నమ్మింది. తినడానికి కూడా కష్టమైన సమయంలో ఇంటి నుండి భోజనం తీసుకువచ్చి నన్ను ఆదుకుంది. నేను హీరో అవుతానని విశ్వసించి నా చేయి పట్టుకుంది అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్న సినిమా అయినప్పటికీ టెక్నికల్ పరంగా ఎక్కడా రాజీ పడలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ చిత్ర బృందం కష్టానికి గుర్తింపుగా, వారి కుటుంబ సభ్యుల కోసం భారతదేశంలోనే అతిపెద్ద స్క్రీన్‌పై స్పెషల్ ప్రీమియర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం విశేషం.

## విష్ణుప్రియకు కలిసి వచ్చిన నెగెటివ్ ఫీడ్‌బ్యాక్

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విష్ణుప్రియ చుట్టూ ఇటీవల ఏర్పడిన వివాదాలు, కేసులు ఆమెకు ఆర్థికంగా లాభం చేకూర్చినట్లు కనిపిస్తున్నాయి. సాధారణంగా వివాదాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయని భావిస్తారు. అయితే విష్ణుప్రియ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారినట్లు చర్చ జరుగుతోంది. వివాదాలకు ముందు ఆమెకు సుమారు 1,892 మంది పెయిడ్ సబ్‌స్క్రైబర్లు ఉండగా, ఒక్కో సబ్‌స్క్రిప్షన్ ధర రూ.380గా లెక్కిస్తే నెలకు దాదాపు రూ.7 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఆమె ఫాలోయింగ్ పరిమితంగానే ఉండేది. అయితే కేసులు నమోదైన తర్వాత సోషల్ మీడియాలో ఆమెపై విస్తృత చర్చ జరగడంతో, ఆమె కంటెంట్ చూడాలనే ఆసక్తి నెటిజన్లలో పెరిగింది. దీంతో పెయిడ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,892 నుంచి 4,832కు పెరిగినట్లు సమాచారం. సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెరగడంతో ఆదాయం కూడా గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె నెలకు రూ.18 లక్షలకుపైగా సంపాదిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. నెగెటివ్ ప్రచారం కూడా కొన్నిసార్లు ఆర్థిక లాభాలకు దోహదపడుతుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com